సాక్షి కర్నూలు
శనివారం ¦ 30 ¦ డిసెంబర్ ¦ 2023



భ్రమరాంబకు ఊయల సేవ

శ్రీశైలం: క్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం ఊయల సేవను నిర్వహించారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మకు కుంకుమార్చనలు చేపట్టారు.



ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

కోసిగి: స్థానిక ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేకపోవడంతో రూ.18లక్షల విలువ చేసే అమ్మకాలను నిలిపి వేశారు.



ఓటుహక్కుపై అవగాహన

కౌతాళం: ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో కౌతాళంలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై ఓటు వేసే విధానాన్ని చూపించారు.

న్యూస్‌రీల్

డీసీఎంఎస్‌లో జన ఔషధి కేంద్రం

- నేడు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జన ఔషధి కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ప్రధాన కార్యాలయంలో జన ఔషధి కేంద్రం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ కేంద్రాన్ని శనివారం డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు ప్రారంభించనున్నారు. ఈ కేంద్రంలో 1,759 రకాల జనరిక్ మందులు, 280 రకాల సర్జికల్ పరికరాలు లభిస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే మందుల ధరలతో పోలిస్తే జన ఔషధి కేంద్రాల్లో జ్వరం, డయాబెటీస్, బీపీ, గ్యాస్, థైరాయిడ్.. ఇలా అన్ని రకాల వ్యాధులకు తక్కువ ధరకే జనరిక్ మందులు లభించనున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోనూ జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ముగ్గురికి కరోనా పాజిటివ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో మరో ముగ్గురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎఫ్ఎంసీ, మెడికల్ ఓపీలలో 53 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించారు. ఇందులో బాలాజీనగర్, కల్లూరు, బుధవారపేటలకు చెందిన వారికి కోవిడ్ పాజిటివ్ వచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. దీంతో జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య ఆరుకు చేరింది.

అడిషనల్ ఎస్పీగా నాగరాజు

- సర్కార్ హెడ్ క్వార్టర్‌కు బదిలీ



నల్లమరి నాగరాజు

కర్నూలు: జిల్లా పోలీసు శాఖ పరిపాలన విభాగం అడిషనల్ ఎస్పీగా(అడ్మిన్) నల్లమరి నాగరాజు నియమితులయ్యారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు డీఎస్పీగా పని చేస్తున్న ఈయనకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పించి కర్నూలు జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా తిరుపతి పట్టణానికి చెందిన నాగరాజు 1989లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఎక్కువ కాలం కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. 2000లో సీఐగా పదోన్నతి పొంది కడప, ప్రకాశం జిల్లాల్లో పనిచేశారు. 2009లో నంద్యాల టూటౌన్ సీఐగా నాలుగు మాసాల పాటు సేవలందించారు. 2011లో డీఎస్పీగా పదోన్నతి పొంది సీఐడీ హైదరాబాద్, తాడిపత్రి, ఏసీబీ కడప, ప్రకాశం జిల్లా దర్శిలో పనిచేశారు. ప్రస్తుతం జమ్మలమడుగు నుంచి పదోన్నతిపై కర్నూలు అడిషనల్ ఎస్పీగా బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న సర్కార్‌ను హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చైతన్య పారం.. అభివృద్ధి బీజం!

ఆదోని డివిజన్ అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక చర్యలు

- ఫలితాలిస్తున్న 'ఆడా' ఏర్పాటు.. అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి
- నీతి ఆయోగ్ సమావేశంలో కలెక్టర్ ప్రసంగం
- ప్రభుత్వ చర్యలను సమగ్రంగా వివరించిన కలెక్టర్ సృజన
- ఐదు నియోజకవర్గాల పరిధిలోని 375 గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక
- 50-60 ఏళ్ల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి దిద్దుబాటు చర్యలు

ఆదోని డివిజన్. ఈ పేరు వింటేనే అమాయకపు పల్లెలు.. అందులోని పేదరికం.. కష్టం కళ్లెదుటే నిల్చుందా అన్నట్లు ఉంటుంది. తినేందుకు బువ్వలేక అనారోగ్య జీవితం, బతికేందుకు మార్గం లేక 'సుగ్గిపోవడం' ఐదు దశాబ్దాలకు పైగా నిత్యకృత్యం. నిరక్షరాస్యత కారణంగా ఈ పల్లెలు వెనుకబాటుతనంలో మగ్గిపోతున్నాయి. ఫలితంగా బాల్యవివాహాలు, వలసలు, పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులు పల్లెపల్లెనా కనిపించే పరిస్థితి. నిశితంగా గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని ఆడా(ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఆ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన చేసిన ప్రసంగం, వివరించిన అభివృద్ధిని విశ్లేషిస్తే ప్రభుత్వ చర్యలు, వచ్చిన ఫలితాలు సీఎం చిత్తశుద్ధికి అద్దం పట్టింది. – సాక్షి ప్రతినిధి కర్నూలు



ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాలు ఏళ్ల తరబడి వెనుకబాటు తనంలో మగ్గుతున్నాయి. ముఖ్యంగా నిరక్షరాస్యతలో వెనుకబడి ఉండటంతో విద్య, ఆరోగ్యం, జీవన విధానం వేటిపైనా వీరికి చైతన్యం లేదు. దీంతో ఏళ్లు గడిచినా వీళ్ల బతుకులు మారలేదు. ఈ ప్రాంత జీవన విధానం, వలసలపై పత్రికల్లో అనేక కథనాలు వచ్చాయి. కానీ ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం సమస్య మూలాలను అన్వేషించి ఆ ప్రాంత అభివృద్ధికి బీజాలు వేశారు. ఈ ప్రాంతంలో వెనుకబడిన 375 గ్రామాల పరిధిని ప్రత్యేకంగా గుర్తించి 2022 జనవరి 12న 'ఆడా' ఏర్పాటు చేశారు. దీనికి ప్రత్యేక అధికారిని నియమించారు. ఏకంగా జిల్లా కలెక్టర్, అధికారులతో గతేడాది సమీక్ష కూడా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'సెస్'(సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషియల్ స్టడీస్)తో సర్వే చేయించి వెనుకబాటు తనానికి కారణాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఓ నివేదికను తెప్పించారు. ఆ ప్రకారం చదువు, ఆరోగ్యం, అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై ఓ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకున్నారు. అవే ఇప్పుడు ఫలితాలిస్తున్నాయి.

నీతి ఆయోగ్ సమావేశంలో ప్రభుత్వ చర్యలను వివరించిన కలెక్టర్

ఢిల్లీలో ఈ నెల 28న నీతి ఆయోగ్ సమావేశం జరిగింది. ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుంచి కర్నూలు కలెక్టర్ మాత్రమే హాజరయ్యారు. బాల్య వివాహాల నివారణకు తీసుకునే చర్యలను వివరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ, బీఎల్ఓలు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, స్వయం సహాయక సంఘాలు, అన్ని ప్రజా, కుల సంఘాల ప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. వచ్చిన మార్పులను గణాంకాలతో తెలియజేశారు.

ప్రభుత్వ చర్యలతో సమగ్ర మార్పులు

దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు 23శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 33శాతం, కర్నూలులో 37శాతం ఉంటున్నాయి. దీని నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా 1098/112 టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసింది. రోజూ సగటున 15 కాల్స్ వస్తున్నాయి. వెంటనే అధికారులు బాల్య వివాహాలను అరికడుతున్నారు. 2022–23లో 96.7శాతం బాల్యవివాహాలను ప్రభుత్వం నిర్మూలించింది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మహిళా సురక్ష కార్యదర్శులను నియమించి తల్లుల్లో చైతన్యం తీసుకొస్తోంది. విద్యలో వెనుకబాటే ప్రధాన కారణం కావడంతో దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

వందశాతం పిల్లలను పాఠశాలకు పంపడమే లక్ష్యం

ఆదోని డివిజన్ జనాభాలో 47.19శాతం నిరక్షరాస్యులు. 21.52 శాతం 5వ తరగతి లోపు, 21.04 శాతం పది లోపు, 4.64 శాతం ఇంటర్, 4.18శాతం గ్రాడ్యుయేషన్ వరకూ చదివిన వారు ఉన్నారు. ఐటీటీ, డిప్లొమా 1.07, పీజీ 0.28, ఇతర చదువులు చదివిన వారు 0.07శాతం ఉన్నారు. దీంతో విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో 2.20లక్షల మంది 5–18ఏళ్లలోపు పిల్లలు ఉన్నారు. వీరిలో 100 శాతం స్కూళ్లకు పంపిస్తున్నారు.

పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక

పోషకాహారాన్ని అందించడంలో ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుంది. 2024 మార్చికి పిల్లల్లో ఇప్పటికంటే అదనంగా 19 శాతం, గర్భిణులలో 26 శాతం లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళికలు రూపొందించింది. అలాగే జూన్‌కు పిల్లల్లో 30 శాతం, గర్భిణుల్లో 50శాతం, డిసెంబర్ నాటికి వందశాతం అందరికీ పోషకాహారాన్ని అందించేలా లక్ష్యం పెట్టుకుంది.

వ్యవసాయరంగానికి సర్కారు దన్ను

ఈ ప్రాంతంలో 14.32 లక్షల జనాభా ఉంటే 11.52 లక్షల మంది గ్రామీణులే. వీరిలో వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారే ఎక్కువ. ఇక్కడ వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఎకరా నుంచి 5 ఎకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులు 89 శాతం ఉన్నారు. వీరికి సాగునీటి వనరుల కల్పనతో పాటు డ్రిప్, స్ప్రింకర్ల ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజ్‌లు, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్యాపిలి సమీపంలో అంతర్జాతీయ స్థాయిలో టెర్మినల్ మార్కెట్ నిర్మిస్తున్నారు. అలాగే కర్నూలు జిల్లా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సోలార్ డ్రైయర్స్ ఏర్పాటు చేశారు. ఉల్లి, టమోటో ఫ్లేక్స్ తయారు చేసి ఎగుమతులు చేస్తున్నారు.

పెరిగిన అడ్మిషన్లు.. బాల్య వివాహాలకు అడ్డుకట్ట

జిల్లా కలెక్టర్ సృజన ప్రత్యేక చొరవతో స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతో ఈ ఏడాది జూన్–ఆగస్టు మధ్యలో 11వేల అడ్మిషన్లు పెరిగాయి.

- వలసలు వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా 71 సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు.
- ఒక్కో హాస్టల్‌లో 60మంది పిల్లలు ఉంటున్నారు.
- ఇలా 4,260 మంది పిల్లలను సీజనల్ హాస్టళ్లలో ఉంచి విద్యను అందిస్తున్నారు.
- దీంతో పాటు ఆర్థికంగా వీరికి ఇబ్బంది లేకుండా 1–10 తరగతుల పిల్లలకు విద్యాకానుక, ప్రతీ తల్లికి రూ.15వేల అమ్మఒడి అందిస్తున్నారు. పిల్లల పెళ్లికి ఇబ్బంది లేకుండా కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తున్నారు.
- దరఖాస్తు చేసుకున్న వారి పుట్టిన తేదీలను పరిశీలించి బాల్య వివాహలు ఉంటే నివారిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవడంతో బాల్య వివాహాలు అరికట్టడం సులువైంది.



చదువుతోనే నిజమైన మార్పు

నీతి ఆయోగ్‌లో బాల్యవివాహాలపై ప్రజెంటేషన్ చేయాల్సి ఉంది. దానికి కారణాలు, నివారణ చర్యలను వివరించడంలో చాలా అంశాలను ప్రస్తావించాల్సి ఉంది. వీటన్నింటికీ నిరక్షరాస్యతే ప్రధాన కారణం. అందరికీ చదువు అందిస్తే అందరిలోనూ అన్ని విషయాల్లో చైతన్యం వస్తుంది. ఆ దిశగానే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఈ ప్రాంతంలోని ప్రతీ పాప, పిల్లోడు మంచి చదువులు చదవాలి. అప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లవుతుంది. మార్పు వస్తోంది. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

– డాక్టర్ జి.సృజన, జిల్లా కలెక్టర్

10లోపు స్టోన్ ప్లాంటేషన్‌ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): రీసర్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్‌ను జనవరి 10 లోపు పూర్తి చేయాలని అధికారులను జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి వివిధ మండల, డివిజన్ స్థాయి అధికారులతో ప్రాధాన్యత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల అనుమానాలను నివృత్తి చేయకుండా సర్వే చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అసైన్‌మెంట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే పనులను పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన అర్జీలను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్ రావు, కేఆర్ఆర్‌సీ డీసీ నాగప్రసన్నలక్ష్మీ, ల్యాండ్ సర్వే ఏడీ మణియప్పన్ పాల్గొన్నారు.

అభ్యంతరాలను పరిష్కరించాలి

ఓటరు జాబితాకు సంబంధించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జనవరి 12వతేదీలోపు పరిష్కరించాలని అధికారులను జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితా ప్రకటనకు జనవరి 22వ తేదీ వరకు గడువును పొడిగించిందన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఫజుల్ రెహమాన్ శుక్రవారం విడుదల చేశారు. 2023 ఆగస్టులో జరిగిన ఈ పరీక్షలకు 1,404 మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 264 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

పేదల చదువుకు ప్రభుత్వ భరోసా



విద్యార్థినులు, వారి తల్లులకు మెగా చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్, ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు

- బటన్ నొక్కి ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేసిన సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 30,479 మంది తల్లుల ఖాతాల్లో రూ.21.92 కోట్లు జమ
- విద్యార్థులు, వారి తల్లులకు మెగా చెక్కును అందించిన జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు(సెంట్రల్): ఆటంకం లేకుండా పేద విద్యార్థులు చదువు కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తూ ఆర్థిక భరోసా ఇస్తోందని ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, మేయర్ బీవై రామయ్య అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం జగనన్న విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అంతేగాక చదువుకునే సమయంలో విద్యార్థుల వసతి, చేతి ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన కింద యేటా రూ.20 వేలను జమ చేస్తున్నారన్నారు. శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి జగనన్న విద్యా దీవెనలో భాగంగా జూలై 2023 నుంచి సెప్టెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించిన నిధులను బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్ రేణుకారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య తదితరులు వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ... చదువుతో పేదరికాన్ని దూరం చేయవచ్చన్నారు. పేదల చదువు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదన్నారు. ఐదేళ్లలో విద్యపై రూ. 75 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. అమ్మ ఒడి, విద్యా కానుక, నాడు–నేడు, జగనన్న విదేశీ విద్యా పథకాల ద్వారా పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. జగనన్న విద్యా దీవెన కింద కర్నూలు జిల్లాలో 33,297 మంది విద్యార్థులకు సంబంధించి 30,479 మంది తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.21.92 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు, వారి తల్లులకు మెగా చెక్కును అందజేశారు.

ప్రభుత్వమే ఫీజు చెల్లించింది



నేను బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నా. మా తండ్రి ఎస్. రహంతుల్లా బంగారు షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు వచ్చే ఆదాయంతో బీటెక్ చదివే పరిస్థితులు లేవు. అయితే జగనన్న ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో బీటెక్ విద్యను పూర్తి చేస్తున్నా. మూడేళ్లుగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తోంది. పేదల ఉన్నత చదువులకు జగనన్న బాసటగా నిలుస్తున్నారు. – ఎస్.తానియా

సంతోషంగా చదువుకుంటున్నా



నేను బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతన్నా. మా తండ్రి వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. రోజు కష్టపడితే తప్ప ఇల్లు గడవదు. ప్రతి నెలా ఇంటి అద్దె కోసం ఎంతో ఇబ్బంది పడుతుంటాం. బీఎస్సీ నర్సింగ్ చేయాలంటే డబ్బు కావాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం మమ్మల్ని ఆదుకుంది. జగనన్న విద్యా దీవెన పథకం కింద రెండు విడతలుగా మా అమ్మ ఖాతాలో నగదు జమ అయ్యింది. ఆ డబ్బును కాలేజీలో కట్టి నేను సంతోషంగా చదువుకుంటున్నా. – జి.శ్వేత

నిఘా పెరిగి.. నేరాలు తగ్గాయి

- ప్రజాహిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చాం
- లోక్ అదాలత్‌లో 4 వేల కేసులు పరిష్కరించాం
- వార్షిక నివేదికను వెల్లడించిన ఎస్పీ



వార్షిక నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ప్రధాన కేసులు	గతేడాది	ఈ ఏడాది
హత్య	39	33
హత్యాయత్నం	86	45
దొమ్మి	28	12
దోపిడీ	05	00
బందిపోటు	14	02
చోరీ	303	224
పగటి దొంగతనాలు	49	26
రాత్రి దొంగతనాలు	130	112

కర్నూలు: క్షేత్రస్థాయిలో పటిష్టమైన నిఘా ఉండటంతో ఈ ఏడాది జిల్లాలో ప్రధాన నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతోపాటు పీడీ చట్టం ప్రయోగం, పల్లెనిద్ర వంటి చర్యలతో నేరాల శాతం తగ్గిందని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో 2023లో జిల్లా పోలీసు శాఖ పనితీరు నివేదికను ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. ప్రజాహిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాల్సి ఉందన్నారు.

వార్షిక నివేదికలో ఎస్పీ వెల్లడించిన ప్రధాన అంశాలు ఆయన మాటల్లోనే ...

- విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చాం. అసాంఘిక శక్తులపై నిఘా పెంచాం. పీడీ యాక్ట్ ప్రయోగంతో నేరాల శాతం తగ్గుముఖం పట్టింది. నాటుసారాపై ఉక్కుపాదం మోపాం. నిందితులకు శిక్ష పడటంపై ప్రత్యేక దృష్టి సారించాం. గంజాయి రవాణాను సమర్థవంతంగా కట్టడి చేశాం. మహిళా పోలీస్ సేవలు మెరుగుపడ్డాయి.
- గతేడాది మొత్తం 6,985 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 5,829 కేసులు నమోదయ్యాయి. హత్యలు, హత్యాయత్నాలు, కొట్లాట కేసులు తగ్గాయి. గతేడాదితో పోల్చుకుంటే అన్ని రకాల నేరాల నియంత్రణలో గణనీయమైన మార్పు కనిపించింది. నేరా నియంత్రణలో పోలీసులు సఫలీకృతమయ్యారు.
- బీట్స్‌ను రీ ఆర్గనైజ్ చేయడం, నిరంతర పర్యవేక్షణ పెంచడం, టెక్నాలజీ వినియోగంతో దొంగతనాలు తగ్గాయి. ఈ ఏడాది నేరస్థులను గుర్తించడంతో పాటు రికవరీ శాతం కూడా బాగా పెరిగింది. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలతో సమన్వయంతో నేరస్తుల ఆటకట్టించాం.
- గత ఏడాది 601 రోడ్డు ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది వాటిని 456కు తగ్గించాం. బ్లాక్ స్పాట్ల గుర్తింపు, రెక్టిఫికేషన్, ప్రమాద సమయాన్ని గుర్తించి ఆ సమయంలో పోలీసు నిఘా ఉంచడంతో ప్రమాదాల శాతం తగ్గింది.
- నేర ప్రభావిత ప్రదేశాలను జియో మ్యాపింగ్ చేయడం, మహిళా పోలీసుల పర్యవేక్షణ పెంచడంతో మహిళలపై జరిగే తీవ్ర నేరాలు తగ్గుముఖం పట్టాయి. కుటుంబ హింసకు సంబంధించిన నేరాలు సైతం నియంత్రించాం. గత ఏడాది ఆరు వరకట్న మరణాల కేసులు నమోదు కాగా, ఈ ఏడాది కేవలం ఒక కేసు మాత్రమే నమోదయ్యింది. అత్యాచార కేసులు కూడా గత రెండేళ్లుగా స్థిరంగా ఉన్నాయి. పోక్సో, గ్రేవ్ కేసులు గత ఏడాది 19 కాగా, ఈ ఏడాది 17 మాత్రమే నమోదయ్యాయి.
- ఎస్సీ, ఎస్టీలపై జరిగే నేరాలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది 151 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఒక శాతం తగ్గించాం. అలాగే సైబర్ నేరాలు కూడా గత ఏడాది 56 నమోదయ్యాయి. ఈ సంవత్సరం 30 శాతం తగ్గించాం.
- జిల్లాలో ఈ ఏడాది నాలుగు విడతలుగా జరిగిన లోక్అదాలత్‌లో పోలీసు శాఖకు సంబంధించి సుమారు 4 వేల కేసులు పరిష్కరించాం. బాధితులు పోగొట్టుకున్న రూ.14.61 కోట్లు విలువ చేసే మొత్తం 6,719 మొబైల్స్‌ను రికవరీ చేశాం.
- గ్రామాలు, పట్టణాల్లో నేర నియంత్రణకు సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావితమైన 112 ప్రదేశాలను గుర్తించి 428 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.
- ఎస్పీ నిర్వహించిన సమావేశంలో డీఎస్పీలు విజయశేఖర్, నాగభూషణం, సీతారామయ్య, శివనారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ధనుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామి తోపాటు శ్రీ గోదాదేవి అమ్మవార్లను దేవాలయం ఎదురుగా ఉన్న యాగశాలలో కొలువుంచి నవకళశస్థాపన అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం ఉత్సవమూర్తి గోదాదేవి అమ్మవారిని, ప్రత్యేక గుడిలో కొలువైన మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ పల్లకీపై ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. మఠం సమీపంలోకి వచ్చిన ఉత్సవమూర్తులకు పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకులు కిడాంబీ వేణుగోపాలన్ ఆధ్వర్యంలో రాపత్తు అధ్యయనోత్సవం నిర్వహించారు.

శ్రీశైలం నుంచి 4,111 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు 4,111 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో 50.3520 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 830.80 అడుగులకు చేరుకుంది.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఏపీజీఎల్ఐ ఏడీ గౌరి ప్రసన్న



ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీ గౌరి ప్రసన్న

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) జాయింట్ డైరెక్టర్ కార్యాలయం అసిస్టెంటు డైరెక్టర్‌గా ఎస్.గౌరి ప్రసన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీజీఎల్ఐ డైరెక్టరేట్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న ఈమెకు అసిస్టెంటు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇంతవరకు ఇక్కడ ఏడీగా పనిచేసిన వెంకటేశ్వర్లు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గౌరి ప్రసన్న మాట్లాడుతూ.. బీమా పరంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరిస్తానన్నారు. ఆమెను పర్యవేక్షకులు పి.రామకృష్ణారెడ్డి, మాధవి, కళ్యాణి, సిబ్బంది సుభాషిణి, మద్దిలేటి, సౌజన్య, పుష్పవల్లి, శివకుమార్ తదితరులు అభినందించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(అర్బన్): మాజీ సైనికుల పిల్లలు ప్రధానమంత్రి ఉపకార వేతన పథకం ద్వారా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రొఫెషనల్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు ఇందుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు www.ksb.gov.in లో జనవరి 1 నుంచి 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఏడుగురు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధిలో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఏడుగురిపై వేటు పడింది. ఇటీవల పెద్దకడుబూరు మండలంలో 16వ రౌండు ఉపాధి హామీ సామాజిక తనిఖీలకు సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఇందులో ఉపాధి సిబ్బంది అక్రమాలు వెలుగుచూశాయి. పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. సస్పెండైన వారిలో పెద్దకడుబూరు ఏపీఓ రామన్న, టెక్నికల్ అసిస్టెంటు (టీఏ) భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్‌లు హరికృష్ణ, నిర్మల, హెచ్.మురవని, చిన్నతుంబళం, పీకలబెట్ట ఫీల్డ్ అసిస్టెంట్లు నరసప్ప, బసవరాజు, నరసింహులు ఉన్నారు.

మంత్రి చొరవతో ప్రగతి‘బాట’

- రూ.5.75 కోట్లతో బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న పలకూరబండ గ్రామస్తులు



నాడు: పలకూరబండ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



నాడు: అధ్వానంగా ఉన్న వంక



నేడు: నూతనంగా నిర్మించిన బ్రిడ్జి



నేడు: నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు



ఆస్పరి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నెరవేర్చారు. దీంతో పలకూరబండ గ్రామస్తుల కష్టాలు తీరాయి. గతంలో ములుగుందం నుంచి పలకూరబండ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేది. మధ్యలో పెద్ద వంక కూడా సమస్యగా మారింది. వర్షాకాలంలో వంక పోటెత్తి రాకపోకలు స్తంభించి పోయేవి. ఆస్పత్రులకు రోగులు, గర్భిణులను తరలించాలంటే ఎన్నో అవస్థలు పడేవారు. కర్నూలు, ఆదోని ఆస్పత్రుల్లో అనారోగ్యంతో మరణిస్తే అంబులెన్స్ వంక దాటకపోవడంతో శవాలను ఎద్దుల బండ్లపై గ్రామంలోకి తీసుకొచ్చి పూడ్చి పెట్టేవారు. సమస్యను పరిష్కరించాలని టీడీపీ హయాంలో అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన గుమ్మనూరు జయరాంకు ప్రజలు సమస్యను విన్నవించారు. తమ ప్రభుత్వం వస్తే పలకూరబండకు బ్రిడ్జి, రోడ్డు వేయిస్తానని జయరాం హామీ ఇచ్చారు. ఆమేరకు ములుగుందం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పలకూరబండకు బీటీరోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.75కోట్లు మంజూరు చేయించారు. నిర్మాణ పనులను పూర్తి చేయించారు. దీంతో పలకూరబండ గ్రామస్తులు ఏ సమయంలోనైనా ఎక్కడకు వెళ్లినా సురక్షితంగా గ్రామానికి చేరుకుంటున్నారు. బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసినందుకు మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

మేలును మరువం



పెద్దల కాలం నుంచి మా గ్రామ సమీపంలో ఉన్న వంకతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో అయితే మిగతా గ్రామాలకు వెళ్లలేం. ఎన్నో ఏళ్ల నాటి సమస్య మంత్రి గుమ్మనూరు జయరాం పరిష్కరించారు. ఆయన చేసిన మేలును మేం ఎప్పటికీ మరువం.

– కనకన్న, పలకూరబండ

ఇబ్బందులు తొలగాయి



గతంలో సరైన రోడ్డు ఉండేది కాదు. వంక దాటడం పెద్ద సమస్యగా మారేది. వర్షాకాలంలో అయితే ఇబ్బందులు మరీ తీవ్రంగా ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు నిర్మించడం వల్ల ప్రయాణ కష్టాలు తీరాయి.

– రంగముని, పలకూర బండ

25 శాతం అదనపు వ్యయంతో ‘జీపీడీపీ’

- జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ టీ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం చేసిన ఖర్చుకు అదనంగా 25 శాతం జోడించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ)ను రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు ఆదేశించారు. శుక్రవారం పీఆర్అండ్ఆర్‌డీ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. జీపీడీపీని జనవరి 31వ తేదీలోగా సిద్ధం చేయాలని, గ్రామసభ నిర్వహించి సభ్యుల ఆమోదంతో దానిని ఈ– గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ సభ నిర్వహించేందుకు ముందే ఆయా గ్రామ పంచాయతీల్లో బాలల, మహిళల గ్రామ సభలు నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీలతో పాటు మండల, జిల్లా స్థాయిలో కూడా డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రూపొందించాల్సి ఉంటుందన్నారు. 2024 ఫిబ్రవరి 28కి మండల పరిషత్ డెవలప్‌మెంట్ ప్లాన్, మార్చి 31వ తేది నాటికి జిల్లా పరిషత్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వివిధ ప్రభుత్వ శాఖలు చేసే వ్యయాన్ని పొందుపరచాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కర్నూలు డివిజనల్ పంచాయతీ అధికారిణి తిమ్మక్క, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ నూర్జహాన్, రిసోర్స్ పర్సన్లు, ఏపీడీఎం తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

- సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచండి
- లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించండి
- నేర సమీక్షలో క్షేత్రస్థాయి అధికారులకు ఎస్పీ ఆదేశం





నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్, సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున అందరూ సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి పోలీసు అధికారులకు ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ నేర సమీక్ష నిర్వహించారు. లైసెన్స్ కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేయించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై, రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి బైండోవర్ చేయాలని, నాటుసారా తయారీ, విక్రయదారులపై నిరంతర దాడులు నిర్వహించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీలు ప్రతిరోజూ బైండోవర్, ఎన్‌బీడబ్ల్యూ, ఎన్‌డీపీఎస్ కేసులతో పాటు కేడీలు, సస్పెక్టుల సమాచారం తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వివరాలు, పోలింగ్ బూత్ లొకేషన్, రూట్ మ్యాప్ గురించి ఇతర శాఖల సమన్వయంతో పూర్తిగా సేకరించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుని గ్రామాల్లో సమస్యలపై ముందస్తు సమాచారాన్ని సేకరిస్తుండాలన్నారు. ఎలాంటి సంఘటన జరగకుండా ముందస్తు నేర నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నేర సమీక్షలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు నాగభూషణం, విజయశేఖర్, సుధాకర్ రెడ్డి, శివనారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, సీతారామయ్య, ఇలియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ అభ్యర్థులు 10న హాజరు కావాలి

కర్నూలు సిటీ: జిల్లాలో 2023–24 సంవత్సరానికి అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీన ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో హాజరు కావాలని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నజీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ విభాగంలో 5, 23, 33, 48, 57, 59, 65, 69, 75, 90, 99, 117, 120, 132, 140, 148, 154, 161, 177, 179, 184, 193, 196, 198, 203, 213, 217, 221, 242, 243, 247, 262, 283, 284, 305, 324, 329, 332, 343, 349, మోటర్ మెకానిక్ విభాగంలో 2, 6, 12, 13, ఎలక్ట్రీషియన్ విభాగంలో 25, 94, 173, వెల్డర్ విభాగంలో 01 సీరియల్ నంబర్లు గల వారు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, 3 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో కాలేజీలో నిర్వహించే ఎంపికకు హాజరుకావాలన్నారు.

నేటి నుంచి ‘పది’ రివిజన్ టెస్టులు

కర్నూలు (సిటీ): వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా నేటి (శనివారం) నుంచి రివిజన్ టెస్టులు నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే రివిజన్ క్లాసులు కూడా ప్రారంభించాలన్నారు. ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు రెగ్యులర్‌గా రివిజన్ టెస్టులను పర్యవేక్షించాలన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి విద్యార్థుల పాలాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థినులు

- జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తుండడంతో కృతజ్ఞతలు

కర్నూలు(సెంట్రల్): జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విద్యార్థులు జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం భీమవరం నుంచి జగనన్న విద్యా దీవెనను ముఖ్యమంత్రి విడుదల చేయడంతో రాయలసీమ యూనివర్సిటీలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు యువత పెద్ద ఎత్తున మద్దతుగా నిలుస్తుందన్నారు. విద్యార్థుల ఓట్లన్నీ వైఎస్ఆర్‌సీపీకే పడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, చంటి, రాఘవ, అంకిత, కల్యాణి, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు



డోన్ ఐటీఐలో వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కేంద్రీయ విద్యాలయం ప్రతినిధి బృందం

డోన్: జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు డోన్ పట్టణంలో తాత్కాలిక భవనాలను శుక్రవారం కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం పరిశీలించింది. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వసతి గృహ భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఇందులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల వసతికి కూడా అనువైన పరిస్థితులు ఉన్నాయని కర్నూలు కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగన్న ఆధ్వర్యంలో బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయ సంఘటన ముఖ్య కార్యాలయానికి త్వరలోనే నివేదిక పంపుతామని రంగన్న వెల్లడించారు. బృందం వెంట జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన పీఏ ప్రతాప్‌రెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, బృందం సభ్యులు హరిప్రసాద్, వెంకటేశ్వర రావు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నం

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు వచ్చే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫారమ్‌లు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ అధికారుల నియామకం, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్టులు, పీఎస్ఈలు, డీఎస్ఈలు, ఈవీఎంల భద్రతా గదులు తదితర అంశాలపై ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇప్పటి వరకు ఫారం–6, 7, 8 అన్ని దరఖాస్తులు కలిపి మొత్తం 857 పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ వెంటనే క్లియర్ చేయిస్తున్నామన్నారు. అలాగే 43 జంక్ క్యారెక్టర్స్ ఉన్నవి, 10 కంటే ఎక్కువ ఓట్లు వున్న 106 కుటుంబాలకు సంబంధించి ఇంటింటి సర్వేలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరిస్తామన్నారు. జిల్లాలో ఉన్న 1,621 పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై పర్యవేక్షించి కొరతగా ఉన్న వాటిపై దృష్టి సారించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 920 లొకేషన్‌లలో 15,070 దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, వీల్ చైర్ల కొరత ఉన్నట్లు ఎన్నికల ప్రధాన అధికారికి కలెక్టర్ వివరించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా ఆయా జిల్లాలలోని అన్ని కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్‌డీఓలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో నిలిచిన నీటి సరఫరా

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో శుక్రవారం నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. ఈ నెల 25న తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపివేసిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులు పాటు కాలువలో ప్రవాహం కొనసాగాల్సి ఉంది. అయితే ఎగువన ఉన్న కర్ణాటక రైతులు నీరు ముందుకెళ్లకుండా కాలువకు అడ్డుకట్ట వేశారు. దీంతో కాలువలో ప్రవాహం పూర్తిగా తగ్గి పోయింది. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం సమయానికి టీబీ డ్యాంలో 10.327 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కారు ఢీకొని విద్యార్థులకు గాయాలు



ప్రమాద స్థలంలో కారు, బైక్

శిరివెళ్ల: నంద్యాల – ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. శిరివెళ్లకు చెందిన నాయక్ సోయల్, కటిక హతీఫ్‌లు యర్రగుంట్ల విమలా స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు రహదారిపై వచ్చి నిలబడ్డారు. ఆ సమయంలో మోత్కలపల్లె నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న బైక్‌పై వెళ్తున్న నరేష్‌ను లిఫ్ట్ అడిగి ఎక్కారు. శిరివెళ్ల మెట్ట దాటిన వెంటనే నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు అక్కడే ఉన్న లారీ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని 108లో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోయల్ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు హాస్పిటల్‌కు తరలించారు. కారు టైర్ పేలి అదుపు తప్పి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు

- ఈ ఏడాది 9,607 కేసులు నమోదు
- జరిమానా కింద రూ.59.70 లక్షల వసూలు



పార్థసారథిరెడ్డి, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్‌పీఎస్

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు తనిఖీలు, దాడులను యాంటీ పవర్ థెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ స్టేషన్(విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్‌పీఎస్) అధికారులు ముమ్మరం చేశారు. ఇన్‌స్పెక్టర్ డి.పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు ముమ్మరం చేశారు. 2022తో పోలిస్తే 2023లో కేసులు పెరిగినప్పటికీ విద్యుత్ చౌర్యం తగ్గినట్లుగా ఆయన తెలిపారు. 2022లో విద్యుత్ చౌర్యానికి సంబంధించి 5,944 కేసులు నమోదు చేసి రూ.45,05,500 జరిమానాలు వసూలు చేసినట్లు శుక్రవారం ఆయన విలేకర్లకు వెల్లడించారు. 2023లో జనవరి నుంచి డిసెంబర్ వరకు 9,607 కేసులు నమోదు చేసి రూ.59,70,500 జరిమానాల కింద వసూలు చేశామన్నారు. గృహ వినియోగానికి సంబంధించే అత్యధికంగా విద్యుత్ చౌర్యం కేసులు నమోదు అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ చౌర్యాన్ని మరింత తగ్గించేందుకు తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు.